
# విశ్వ కర్మ సమాజ అభ్యున్నతి కోసం ఐక్యతతో ముందుకు సాగాలి

## రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం






నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :విశ్వకర్మ సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం అన్నారు. నిజామాబాద్ కేంద్రంలోని గోశాల భవన్ హాల్‌లో ఆదివారం ది అఖిల భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సంఘం బలోపేతమే సమాజ అభివృద్ధికి పునాది అని, అన్ని వర్గాల విశ్వకర్మలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అధ్యక్షులు గంగా మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని 11 మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొని విశ్వబ్రాహ్మణుల సామాజిక, ఆర్థిక, విద్యా సంబంధిత సమస్యల పై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ పథకాల అమలులో విశ్వకర్మలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని, సమాజ అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్వకర్మలకు నెలకు రూ.10 వేల పెన్షన్ మంజూరు చేయాలని, పేద, నిరుపేద విశ్వకర్మ కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సంప్రదాయ వృత్తులను కొనసాగిస్తున్న విశ్వకర్మ కళాకారులకు ఆర్థిక సహాయం, రుణ సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకోజు లింగాచారి మాట్లాడుతూ విశ్వకర్మ సమాజం రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత బలపడాలంటే సంఘటిత శక్తిగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. హక్కుల సాధన కోసం ప్రతి మండలంలో సంఘ కార్యకలాపాలను విస్తరించి యువతను కూడా సంఘంలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఆవంచ మురళీధర్ చారి, అధికార ప్రతినిధి పడాల సతీష్ చారి, 33 జిల్లాల కన్వీనర్ డాక్టర్ పోకూరి లక్ష్మీనాచారి, మహిళ ఉపాధ్యక్షురాలు ఇంద్రాల అశ్విని, మహిళ అధికార ప్రతినిధి కస్తోజు శ్రావణి, జిల్లా అధ్యక్షులు గంగా మోహన్, ప్రధాన కార్యదర్శి డి.ఎల్.ఎన్. చారి, కోశాధికారి నరేష్‌తో పాటు రాజు, వినోద్, రాము, నవీన్ చారి, శ్రీనివాస్, నారాయణ, రాణావీర్, మండల కమిటీ, గ్రామ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో విశ్వకర్మ సంఘ నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం సంఘ బలోపేతం, సభ్యత్వ నమోదు, ప్రభుత్వానికి వినతిపత్రాల సమర్పణ తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

# నరసన్న పోరాట స్ఫూర్తితో రైతు ఉద్యమాలను నిర్వహిస్తాం

## ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య






నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు అమరుడు కామ్రేడ్ నాయక్ వాడి నరసయ్య పోరాట స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాలను నిర్మిద్దామని ఏఐకే ఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. ఆదివారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ మండలం కాలుర్ గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో నాయక్ వాడి నరయ్య ప్రథమ వర్ధంతి సభను కత్తుల సాయిలు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా నర్సన్న చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు. అనంతరం భూమయ్య మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారానికి జరిగిన అనేక ఉద్యమాలకు నరసయ్య నాయకత్వం వహించారని చెరుకు రైతుల పోరాటంలో ఎన్సిఎస్ఎఫ్ సారంగాపూర్ ఫ్యాక్టరీలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో నర్సన్న పాత్ర ఎనలేనిదని వారన్నారు. సింగూరు నీరు ఇందు రు హక్కుగా నిజాంసాగర్ ఆయకట్టు రక్షణకై జరిగిన పోరాటంలో, చక్కెర ఫ్యాక్టరీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో, మూత పడిన ఫ్యాక్టరీని తెరిపించడానికి, రామడుగు చెరువు రక్షణ తదితర పోరాటంలో నరసన్న పోరాటం వెలకట్టలేని వారన్నారు. పాలకుల తప్పుడు విధానం వల్ల ఈనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల మూలంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభం లోకి నెట్టివేయబడు తుందని, మోడీ ప్రభుత్వం తీసుకు వస్తున్న చట్టాలు రైతుల మెడకు ఉరి తాళ్లుగా మారుతున్నాయని భూమయ్య అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన విద్యుత్ చట్టం, విత్తన చట్టం, జీరాంజి చట్టాలు ప్రజలకు వ్యతిరేకమైనవని వాటిని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సభలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు శివకుమార్ మాట్లాడుతూ ఎగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నర్సన్న ఒక రైతు సమస్యల కాకుండా పేద అణగారిన కార్మిక ప్రజల దైనందిన సమస్యలను పరిష్కరించడంలో ముందు వరసలో ఉన్నారని అన్నారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా జరిపిన పోరాటాలు గ్రామాలలో పటేల్, పట్వారిలా దోపిడి దౌర్జన్యాల నిలదీస్తూ కళారూపాలను ప్రదర్శించి ప్రజలను పోరాటం వైపు నిలబెట్టిన గొప్ప నాయకుడని అన్నారు. అలాంటి నరసన్నకు మనమంతా ప్రజా ఉద్యమాలను నిర్మించడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కత్తుల సాయిలు, సరికెల సాయిలు, కుత్తనాల గంగాధర్, సుశీల, కే.రజిత, నాడాపూర్ సాయవ్వ, కంతి పద్మ, సుజాత, కుర్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్-1 డిపో ఆవరణలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో ముందు ఏర్పాటు చేసిన యూనియన్ జెండాను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు యూనియన్ చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు.

అనంతరం గ్యారేజ్ విభాగానికి చెందిన దీపక్‌తో పాటు పలువురు ఉద్యోగులు భారీ సంఖ్యలో ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. కొత్తగా చేరిన సభ్యులను నాయకులు శాలువాలతో సత్కరించి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి సాయిలు, రాష్ట్ర కార్యదర్శి డి. సంజీవ్, డిపో కార్యదర్శి లింబాద్రి, దీపక్, జే.ఎల్. రెడ్డి, కే.ఎం. రెడ్డి, భోజన్న, లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ



రుద్రూర్, బతుకమ్మ : కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ నాయకులు రుద్రూర్, అంబం, రాణంపల్లి, అక్బర్ నగర్ గ్రామాలలో యువతకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెరగడానికి క్రీడలు దోహదపడతాయని కోనేరు శశాంక్ పేర్కొన్నారు. క్రికెట్ కిట్ ను ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ బృందం, ముదునూరి కృష్ణం రాజు, కటిక రామరాజు, నాగారం చిన్న సాయిలు, బేగరి వినోద్ కుమార్, ఆలపాటి హరికృష్ణ, ప్రశాంత్ గౌడ్, ఏముల గజేందర్, పార్వతి మురళి, వడ్ల సాయినాథ్, బోజిగౌండ అనిల్, చుండూరి రవితేజ, కుర్లెపు గంగాధర్, రేపల్లి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

# ఎల్లయ్య చెరువులో మట్టి దొంగలు...

## చెరువు సుందీకరణ పేరుతో మట్టి లూటి

## చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలో అక్రమ నల్ల మట్టి, మొరం వ్యాపారం జోరుగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత నెల రోజులుగా పొద్దున్న ట్రాక్టర్లలో, రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా నల్ల మట్టిని ఇటుక బట్టీలకు, ప్రైవేట్ వెంచర్లలకు, తరలిస్తూ అక్రమార్కులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని ఎల్లయ్య నుంచి పెద్ద ఎత్తున నల్ల మట్టి తరలింపు జరుగుతున్నప్పటికీ మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామూలు తీసుకుంటూ అధికారులు అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు రైతులు, స్థానిక ప్రజలు అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో భారీ టిప్పర్ల రాకపోకలతో పట్టణ రహదారులు దెబ్బతింటుండటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి తరలింపుపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి మహాప్రభో . . .

## తినేందుకు తిండి లేదు ...
## తలదాచుకునేందుకు
## నీడ లేదు
## వృద్ధ దంపతుల ఆవేదన



కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల్ ఎర్రపాడు గ్రామానికి చెందిన ఇరుమ లక్ష్మి - రాజయ్య అనే వృద్ధ దంపతుల బతుకుచిత్రం చూస్తే ఎవరికైనా కన్నీళ్లు ఆగవు. అది ఇల్లు కాదు మూడు కర్రల మధ్యన కట్టిన ప్లాస్టిక్ తాటిపత్రి కాస్త గట్టిగా గాలి వీచినా ఎగిరిపోయే ఆ ప్లాస్టిక్ కవర్ కిందే ఆ వృద్ధ దంపతుల ప్రపంచం నడుస్తుంది. ఒకవైపు కడు పేదరికం. మరోవైపు రోగాలమయమైన వృద్ధాప్యం వెంటాడుతున్నా తల దాచుకోవడానికి కనీసం ఒక చిన్న గూడు కూడా లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలి తీర్చే బడి బడి ఆవరణను ఊడుస్తూ వయస్సు పై పడటంతో వీరికి కూలి పన్నులు చేసే ఓపిక లేదు. వీరికి తోడుగా ఒక మనవరాలు ఉంది. ఆ పాప బాధ్యత కూడా ఈ వృద్ధులపైనే పడింది. ఆ గ్రామంలోని ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనమే ఈ వృద్ధ దంపతుల ఆకలి తీరుస్తుంది. ప్రతిరోజు ఉదయాన్నే లేచి ఆ బడి ఆవరణను ఊడుస్తూ కాలం గడుపుతున్నారు. సొంతగా ఒక చిన్న గూడు కట్టుకోవాలని ఉన్నా రూపాయి తీసి రూపాయి పెట్టె స్తోమత వీరికి లేదు. అందుకే ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తారేమో అని ఆశగా, కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే ఎలాగో డబ్బులు వస్తాయని, ఆ వచ్చే డబ్బులను నమ్ముకొని, ఎవరైనా పెద్దమనసున్న దాతలు ముందుకు వచ్చి సాయం చేయకపోతారా ? ముందుకు వచ్చి మాకు ఒక చిన్న గది అయినా కట్టించి ఇవ్వకపోతారా, అనే ఆశ ఆ వృద్ధ దంపతులను ప్రతిక్షణం వెంటాడుతోంది. ఎవరైనా సహాయం చేస్తే ఈ తాటిపత్రి నరకం నుంచి బయటపడి ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటాం అంటూ ఆ వృద్ధులు కన్నీళ్ళతో వేడుకుంటున్నారు.